టెండర్ల దశకు విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు

- పూర్తయిన స్థల సేకరణ
- రూ.133 కోట్లతో 220/132/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరు
- రుస్తుంబాదలో 10 ఎకరాల స్థలంలో నిర్మాణం



నరసాపురంలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

నరసాపురం: పెరుగుతున్న జనాభాతో పాటు పెరుగుతన్న గ్రామాల విస్తీర్ణం నేపథ్యంలో గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. ముఖ్యంగా వేసవి కాలంలో అందరూ ఫ్రిడ్జ్‌లు, ఏసీలు ఆన్ చేయడంతో లో-ఓల్టేజ్ సమస్యతో బాధపడుతున్నారు. అయితే ఈ సమస్యలను పరిష్కరించేలా నరసాపురంలో నిర్మించనున్న భారీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు టెండర్ దశకు చేరుకున్నాయి. టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి పనులు మొదలు పెట్లాని అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కూడా ఎప్పటికప్పుడు ఈ ప్రాజెక్ట్ పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ లో-ఓల్టేజ్ సమస్యలకు చెక్ పెడుతూ రూ.133 కోట్లుతో 10 ఎకరాల స్థలంలో 50 ఎంవీఏ సామర్యంతో 220/132/11 కేవీ భారీ సామర్థ్యంతో నరసాపురంలో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని గత ఏడాది ప్రభుత్వం నిర్ణయించింది. ట్రాన్స్‌కో ద్వారా దీనికి సంబంధించి జీవో నెంబర్ 2368ని గతేడాది ఫిబ్రవరినెలలో విడుదల చేసింది. అదే ఏడాది నవంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి పట్టణంలోని రుస్తుంబాద ప్రాంతంలో 10 ఎకరాల స్థలాన్ని సేకరించారు.

లో ఓల్టేజ్ సమస్యలకు చెక్..

నరసాపురంలో ఇప్పటికే 132/11 కేవీ సబ్‌స్టేషన్ ఉంది. ఈ సబ్‌స్టేషన్‌లో గతంలో 50 ఎంవీఏ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉండేది. ఇటీవలే ఆ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 80 ఎంవీఏకు పెంచారు. ఇప్పుడు అదనంగా, అనుసంధానంగా మరో 50 ఎంవీఏ సామర్యంతో 220/132/11 కేవీ సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాలకు ప్రస్తుతం నరసాపురం సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇందులో నరసాపురం, పాలకొల్లు మున్సిపాలిటీలు ఉన్నా యి. నరసాపురం, పాలకొల్లు రూరల్ మండలాలు, యలమంచిలి, మొగల్తూరు, పోడూరు మండలాల్లో ఎంతోకాలంగా విద్యుత్ లో-ఓల్టేజ్ సమస్యలతో ఇబ్బందులుపడుతున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఇబ్బందులు మరీ ఎక్కువగా ఉంటున్నా యి. వారంరోజుల క్రితం వచ్చిన మిచాంగ్ తుపాను వంటి క్లిష్ట సమయాల్లో కూడా విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతుఆన్నాయి. ఇప్పుడు ఇక ఈ సమస్యలకు చెక్ పడనుంది. నరసాపురం తీరప్రాంతంతో పాటుగా, మొగల్తూరు, యలమంచిలి, పాల కొల్లురూరల్ మండలంల్లోని పరిసరప్రాంతాల్లో విస్తారంగా ఆక్వాసాగు జరుగుతుం కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే నాణ్యమైన విద్యుత్ ఆక్వా రైతులకు కూడా సరఫరా అవుతుంది.

త్వరలో పనుల ప్రారంభం



కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయించి, వినియోగంలోకి తేవాలని భావిస్తున్నాం. స్థల సేకరణ పూర్తయ్యింది.ఈ నెలలోనే టెండర్లు పిలిచే విధంగా ప్రయత్నం చేస్తున్నాం. కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే లో-ఓల్టేజ్ సమస్యలు ఉండవు. భారీ సామర్థ్యంతో కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ కట్టడం వల్ల ఇక విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉండవు. ఎండాకాలం, వర్షాకాలం అని సీజన్‌లతో సంబంధం లేకుండా విద్యుత్ సరఫరా నిరంతరంగా సాగుతుంది.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు



విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలు తొలగించే పనులు శుక్రవారం చురుగ్గా సాగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేసి ఈ పనులు చేపట్టారు. హైటెన్షన్ విద్యుత్ వైర్లపైకి వేలాడే చెట్ల కొమ్మలను తొలగించడం ద్వారా అధిక వర్షాలు, బలమైన గాలుల సందర్భంల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడకుండా ఉంటుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బళ్ల సురేష్‌కుమార్ తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు వల్ల రుస్తుంబాద రూరల్, యర్రంశెట్టివారిపాలెం, సీతారామపురం, కొప్పర్రు, లిఖితపూడి, సరిపల్లి, గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

క్లుప్తంగా

ఆడుదాం ఆంధ్ర క్రీడా సామగ్రి అందజేత



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ సూచించారు. శుక్రవారం చైర్‌పర్సన్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు వార్డులలకు చెందిన యువకులకు ఆడుదాం ఆంధ్ర క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు కూడా యువతను క్రీడలవైపు తీసుకెళ్లేలా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ, కౌన్సిలర్ కావలి రామసీత, గోరు సత్తిబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రిస్మస్ వేడుకలు



పాలమూరులో మాట్లాడుతున్న బి.ఆనంద్‌కుమార్

పెనుమంట్ర: క్రీస్తును మనరక్షకునిగా స్వీకరిస్తే నిజమైన సంతోషం, సమాధానం వస్తుందని పశ్చిమ గోదావరి జిల్లా సినైడ్ అధ్యక్షుడు బిషప్ బి.ఆనంద్‌కుమార్ అన్నారు. శుక్రవారం పాలమూరు గ్రామంలో ఏపీఫానియా లూథరన్ చర్చిలో ప్యారీస్ పాస్టర్ కత్తుల ఆశీస్‌విక్టర్ అధ్యక్షతన జరిగిన పెద్దల క్రిస్మస్ పండుగ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన పేరిస్ పరిధిలోని పెద్దలకు నూతనవస్త్రాలను సమర్పించి అనంతరం సినైడ్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ప్రసంగీకులు టీఎస్ లాజరస్, బందెల విల్సన్‌బాబు, పల్లెం ఏసురత్నం, ఏఈఎల్‌సీ సభ్యులు పట్టాదేవరాజు, వర్గీస్ దానియేలు, పట్టా ఇందిర, కాకర సత్యవతి, సర్పంచ్ కాకర రాజేశ్వరరావు, వడ్లమూడి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

కర్ణాటక భక్తుల పూజలు




పెనుగొండ వాసవీ ఆలయంలో పారాయణ చేస్తున్న మహిళలు

పెనుగొండ: స్థానిక నగరేశ్వర మహిషాసుమర్ధనీ వాసవీకన్యకపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం కర్ణాటక రాష్ట్ర భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు వాసవీ మాత చరిత్ర పారాయణ చేశారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహిళలే సమాజానికి దిక్సూచి

యలమంచిలి: మహిళలే సమాజానికి దిక్సూచని ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి అన్నారు. కలగంపూడి గ్రామంలో శుక్రవారం జరిగిన బేటి బచావో, బేటి పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అమ్మాయిల చదువు లోకానికి వెలుగని బాల్యం నుంచే బాలికలపై కట్టుబాటు పేరిట అనవసర ఒత్తిడి తేకూడదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొత్తూరి విష్ణుప్రియ బుచ్చిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వినుకొండ ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బండి శ్రీను వైఎస్సార్ సీపీ నాయకులు వినుకొండ రవి, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, ఉచ్చుల స్టాలిన్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి కోరారు. యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగిన పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ ఏడాది మంజూరైన హెచ్‌డీఎఫ్ నిధులను ఆసుపత్రిలో మౌలిక వసతులకు వెచ్చించాలని తీర్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బర్రే మేరీ ప్రసాద్, డాక్టర్ వర్ధనపు సుభాష్‌చంద్ర స్వరూప్, ఎంపీహెచ్‌ఈఓ జేవీ సత్యనారాయణ, ఫార్మాసిస్ట్ మేడికొండ రామదాసు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పంట నష్టం అంచనాలు



పేరుపాలెంలో చేలు మునిగిన రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు



మొగల్తూరు రహదారిపై ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

మొగల్తూరు: మిచాంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాల్లో జరిగిన నష్టాలను అంచనా వేసేందుకు వ్యవసాయాధికారులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది కృషి చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత నాలుగు రోజులుగా మండలంలో పర్యటిస్తున్నారు. శుక్రవారం వ్యవసాయాధికారులు అబ్దుల రహీమ్, మౌనికలు పేరుపాలెం గ్రామంలో పర్యటంచి మునిగిన పొలాలను గుర్తించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఓ రహీమ్ మాట్లాడుతూ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన చేలను 230 ఎకరాలుగా గుర్తించామన్నారు. మరో 300 ఎకరాలవకూ పంట నష్టం వాటిల్లే అంచనా వేస్తున్నామని ఆయన తెలిపారు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారి మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వార్తల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా గత వారం రోజులుగా నీటిలో ఉన్న పనలను ఒడ్డుకు చేర్చే ప్రయత్నంలో రైతులుండగా, మొగల్తూరు జాతీయ రహదారిపై ఆరబోసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసే ప్రయత్నంలో రైతులు నిమగ్నమయ్యారు.

డ్వాక్రా సంఘాలు బలోపేతం కావాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: డ్వాక్రా సంఘాలు మరింత బలోపేతమయ్యే దిశగా అధికారులు కృషి చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. శుక్రవారం ముదునూరి తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గస్థాయిలో డ్వాక్రా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు అనేక విధాలుగా చేయూత అందిస్తుందని చెప్పారు. డ్వాక్రాగ్రూపు మహిళలు ఆర్థికంగా బలపడడానికి చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ క్రమంలో అర్హులైన ప్రతీ మహిళ డ్వాక్రా గ్రూపులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. డ్వాక్రా సంఘాల్లో చేరడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించాలని చెప్పారు. ఇక సంఘాల బలోపేతానికి క్రమం తప్పకుండా గ్రామ సమాఖ్య సమావేశాలు జరగాలని సూచించారు. ఈ సమావేశాల్లో అన్ని విషయాలు వివరంగా చర్చించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమీక్షలో డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీ శివప్రసాద్, డీపీఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న బీజేపీ కన్వీనర్ వెంకటేశ్వరరావు

మొగల్తూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వికసిత్ భారత్ సంకల్పయాత్ర జిల్లా కన్వీనర్ పులపర్తి వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం పేరుపాలెం సౌత్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఆశయాల మేరకు ప్రజల అవసరాలను గుర్తించి వాటా పరిష్కారానికి నాయకులు కృషి చేయాలన్నారు. గతంలో ఏదైనా సంఘటన జరిగితే నష్టపరిహారం అందించడానికి రోజులు పట్టేదని, కానీ ప్రస్తుతం మన ప్రభుత్వంలో రోజుల్లోనే నష్టపరిహారం అందిస్తున్నామన్నారు. ప్రతి నాయకుడు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించుకుని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాని సూచించారు. సమావేశంలో సర్పంచ్ అందే వెంకటలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యుడు అందే దొరబాబు, నాయకులు కవురు శ్రీను, దాసరి బాబి, ఏఓ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రానికే కాకుండా యావత్ భారతదేశ ప్రజలందరికి చిరస్మరణీయుడని ఆయనను ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకుని దేశ రక్షణ కోసం పాటుపడాలని మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ ఎం భరత్‌లక్ష్మి అన్నారు. పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రామభద్రరాజు, ఆఫీస్ ఇన్‌ఛార్జ్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పీవీ రమణారావు, ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజులబీబీ పాల్గొన్నారు.

జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో సర్దార్ వల్లబాయ్ పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో పటేల్, శ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీఐ రైజింగ్ క్లబ్ అధ్యక్షులు మామిడి కౌశిక్, డాక్టర్ కావలి మౌని, హెచ్‌ఎం రాయపూడి భవానీ ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌వద్ద, స్థానిక రామగుండం పార్క్ వద్ద, మన్యం జగ్గమ్మ సత్రం ప్రాంతంలో ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మామిడి వెంకటేశ్వరరావు, రేపాక ప్రవీణ్‌భాను, శ్రీకాకొల్లు కామేశ్వరరావు, పిరాట్ల శ్రీను, మాజేటి షణ్ముఖరావు, సలాది వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలతో సామాజిక అభివృద్ధి

భీమవరం: సంక్షేమ విద్యుత్ వినియోగాన్ని పెంచుకునే విధానాలను, పరికరాల కొత్త ఆవిష్కరణలతో సామాజిక అభివృద్ధి సాధ్యమని ఎలక్ట్రికల్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎనర్జీ ఎఫిసియెంట్ ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటర్నెట్ ఆధారిత సాధనాలు, సరీ్వసెస్, స్మార్ట్ హోమ్ అనుభవాలు, బిజీ లైఫ్‌స్టైల్స్ పరికరాలను అందించే టెక్నాలజీలను ఎంచుకోవచ్చునన్నారు. ఎలక్ట్రికల్ డీఈ ఎం.రాజగోపాల్‌చౌదరి, ఏఈ పి.శ్రీనివాసరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) పాల్గొన్నారు.

ఏపీలో పేదలకు జగనన్న పాలనే కావాలి



పాలకొల్లు అర్బన్: కాపవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా తడి చెత్త, పొడిచెత్త సేకరణకు ప్లాస్టిక్ డబ్బాలు అందిస్తున్న నాయకులు

పెనుగొండ: ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న పేదలు నాలుగున్నరేళ్లుగా సంక్షేమంతో అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి కావాలంటూ ప్రజలు కోరుకుంటున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శుక్రవారం ఆచంట మండలం కొడమంచిలి సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజలు సమస్యలు తెలుసుకోవడానికి వీలవుతుందన్నారు. దేశంలో ఏ నాయకుడూ చేయని వినూత్న సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి సంక్షేమ సారథిగా ప్రజల మనస్సులో నిలిచారన్నారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసే ఏకైక నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యల్లమెల్లి బేబీ రాజేష్, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల సత్యనారాయణ, దేవస్థానం చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, ఉప సర్పంచ్ ములగాడ వర ప్రసాద్, సచివాలయ కన్వీనరు టీఎస్‌డీ చంద్రశేఖర్, పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండేటి రమేష్, జక్కంశెట్టి వెంకటేశ్వరరావు, రమణ, పద్మారావు, కొల్లి సాయి, పోలిశెట్టి వనమరాజు, చెల్లా సుభాకర్ పాల్గొన్నారు.

పెనుగొండలో

పెనుగొండ సచివాలయం-04 పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శాంతి నగర్‌లో ప్రారంభించారు. ఇంటింటా తిరుగుతూ అందిన సంక్షేమాన్ని వివరిస్తూ రాబోయే రోజుల్లో మరింత సంక్షేమాన్ని అందిస్తామంటూ వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యుడు పూతినీడి శ్రీను, గృహ సారథి దొరా రెడ్డి, బాలం తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమం

పాలకొల్లు అర్బన్: అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు చెప్పారు. పాలకొల్లు మండలం కాపవరంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో సంక్షేమ పథకం లబ్ధిదారులకు అందాలంటే లంచం ఇవ్వాలన్నారు. అలాగే అరకొరగా లబ్ధి చేకూరేదన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్ వ్యవస్థను పెట్టి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నట్లు చెప్పారు. వాలమర్రు, కాపవరం గ్రామాలకు సంబంధించి ప్రత్యక్ష నగదు బదిలీగా రూ.19,05,77,235, పరోక్ష ప్రయోజనాలుగా రూ.5,95,25,322, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం రూ.2,98,36,000, మొత్తంగా రూ.27,99,38,557 ప్రయోజనం కలిగిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, ఎంపీటీసీ యాండ్ర శైలజకుమారి, పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, వాలమర్రు సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు వేండ్ర సింహాచలం, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, గ్రామ పార్టీ నాయకులు పాలపర్తి నాగేశ్వరరావు, అల్లం నాగలింగం, కట్టా రామకృష్ణ, పడవల బాబూరావు, గూడూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేల పరిరక్షణ అందరి బాధ్యత



మార్టేరులో ర్యాలీ నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

పెనుమంట్ర: ఎరువులు, రసాయనాలు వినియోగం వల్ల నేల నీరు కలుషితం అవుతుందని వీటిని తగ్గించే దిశగా రైతులను సమాయత్తం చేయాల్సిన అవసరం ఉందని మృత్తిక ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో జరిగిన ప్రపంచ మృత్తికా దినోత్సవం పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేలల్లో నిక్షిప్తమై ఉండిపోవడంవల్ల వర్షపునీటితో భూమిలో ఇంకిపోవడం వంటి సమస్యలు ఎదురు అవుతున్నాయన్నారు. రు. ఈసందర్భంగా విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ ఎం.భరత్ లక్ష్మి చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామభద్రరాజు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


అవినీతిపై మాట్లాడడం విడ్డూరం

పెనుగొండ: తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు అవినీతిపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం ఎద్దేవా చేశారు. శుక్రవారం తూర్పుపాలెంలో విలేకర్లతో మాట్లాడుతూ రచ్చబండ అంటూ నియోజకవర్గంలో హడావిడి చేస్తూ ఉనికిని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నారని విమర్శించారు. ప్రజలు నమ్మక పోయినా అవినీతి జరిగిపోయిందంటూ గొంతు చించుకొంటుంటే ప్రజలు నవ్వుతున్నారన్నారు. అధికారంలో ఉన్న అన్ని రోజులు ప్రతీ పనిలోనూ 10 శాతం కమీషన్లు తీసుకొంటూ నానా ఇబ్బందులు పెట్టిన సంగతి ప్రజలు మరచిపోయారని అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. చివరకు సీఎం ఆర్‌ఎఫ్ నిధుల్లోనూ కమీషన్ తీసుకుని పేదలకు చెందాల్సిన సొమ్ముతో సోకులు చేసుకొన్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ పారదర్శకంగా పాలనకు శ్రీకారం చుట్టామన్నారు. మాజీ మంత్రి పితాని ప్రజలను ఎంత మభ్యపెట్టాలని ప్రయత్నించినా ఆచంట నియోజక వర్గం నుంచి పేదలకు అండగా నిలుస్తూ సొంత డబ్బుతో ఆదుకొంటున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

రేపటి నుంచి ధనుర్మాస ఉత్సవాలు

నరసాపురం రూరల్: నరసాపురం పట్టణంలోని శ్రీ ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామి, మండలంలోని పసలదీవి గ్రామంలోని రామాలయంతో పాటు వివిధ వైష్ణవ దేవాలయాల్లో ఈ నెల 17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభిస్తున్నట్లు ఆయా ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. జనవరి 16, 2024వ తేదీ వరకూ నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదికేశవ ఎంబరుమానార్ స్వామి ఆలయంలో జనవరి 7 నుంచి 13వ తేదీ వరకూ నీరాట్ట ఉత్సవాలనుకూడా అత్యంత వైభవంగా జరుగుతాయని ఆలయ ఫౌండర్ ట్రస్టీ పుప్పాల వెంకట కృష్ణారావు తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిరోజు ఉదయం 5.30 గంటల నుంచి ధనుర్మాస పూజలు, 7.30గంటలకు తిరుప్పావై ఉపన్యాసం ఉంటుందని వివరించారు. 14న భోగి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ 45వ జిల్లా మహాసభల రద్దు



స్టేజీని తొలగిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో శుక్రవారం, శనివారం రెండు రోజులు పాటు జరగాల్సిన ఎస్‌ఎఫ్‌ఐ 45వ జిల్లా మహాసభలు రద్దయ్యాయి. ఈ మహాసభలు స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నుంచి ర్యాలీగా ప్రారంభించి స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పక్కనున్న ఖాళీ ప్రదేశంలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావాల్సిన ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఈ సభకు వస్తుండగా మార్గ మధ్యలో కారు ప్రమాదానికి గురై మృతి చెందడంతో ఈ కార్యక్రమాలను రద్దు చేసినట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.యశ్వంత్ తెలిపారు. సాబ్జి మృతి తమకు తీరని లోటని ఆయన మృతిపై సంతాపం తెలిపారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

మొగల్తూరు: తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. మొగల్తూరు మండలానికి సంబంధించి అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మెకు శుక్రవారం పలు రాజకీయ పార్టీ నాయకులు మద్దతు పలికారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు తహసీల్దార్ జి.అనితా కుమారి, ఎంపీడీఓ బాబ్జిరాజుకు వినతిపత్రం అందజేశారు.

CHANGE OF NAME

I, DEEPATI PRABHAKARARAO S/o Masenu resident at Door No. 2-57, Gamallapenta, NARNIMERAKA, Yelamanchili mandal W.G Dist. A.P., India. 534266. I hereby declare that my name changed as DEEPATI PRABHAKARARAO (New Name) previously called DEEPATI PRAGHAKARARAO (Old Name). Hereinafter all my documents and correspondence with new Name DEEPATI PRABHAKARARAO

ప్రకటన

నా క్లయింటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,భీమవరం వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ దొంగ నాగేశ్వరరావు [illegible] తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. మొగల్తూరు సబ్‌రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నెం.3112/2023, ఆర్.యస్.నం.101/7 మొగల్తూరు మండలం ముత్యాలపల్లికి చెందిన 435-6 చ.గ. స్థలానికి హద్దులు తూర్పు: దొంగ వెంకటేశ్వర్లు ఇల్లు, పడమర: దొంగ రాముడు ఇల్లు, స్థలం, ఉత్తరం: దొంగ సాయిలక్ష్మి స్థలం, [illegible] దక్షిణం: దొంగ వెంకటేశ్వర్లు గారి ఇల్లు,స్థలం.

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం,బి.ఎల్.
అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : [illegible]

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్
9010223729 (ఆచంట)
9010201609 (నరసాపురం)
9505507552 (పాలకొల్లు)
Office mail : tpgadvt@gmail.com